ప్రజాశక్తి
శుక్రవారం 28 జులై 2023 5 విజయనగరం



నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం లేఖ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణంలో పంట పొలాలు వద్ద రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా, ఇరిగేషన్ అధికారులతో చర్చించకుండా తూములు నిర్మించడం వల్ల పొలాల్లో నీరు నిలిచిపోయి లక్షలాది రూపాయల పంట నష్టపోయిందని, వెంటనే రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు కలెక్టర్‌కు లేఖ రాశారు. పైనుంచి వచ్చే నీరు తూము నుంచి కిందికి పోయే అవకాశం లేక పొలాల్లో నిల్వ ఉండిపోయిందన్నారు. దీనివల్ల రైతులు నష్టపోతున్నారని, పరిహారం చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు పరిశీలించి రైతులతో చర్చించి నీరు నిలిచి పోకుండా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

భూ కేటాయింపులో జాప్యం వద్దు

పరిశ్రమల శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు భూ కేటాయింపు చేయడంలో జాప్యం జరగడానికి వీల్లేదని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. వివిధ పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన ప్రతిపాదనలపై భూకేటాయింపు ప్రక్రియలను వేగవంతం చేసి ఆయా పరిశ్రమలు త్వరగా ఏర్పాటయ్యేలా సహకారం అందించాలని పరిశ్రమల శాఖ. ఎపిఐఐసి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన భూమికోసం రెవిన్యూ అధికారులతో పరిశ్రమల శాఖ అధికారులు స్వయంగా మాట్లాడి పరిష్కరించాలన్నారు. క్లస్టర్ అభివృద్ధి పథకంలో పరిశ్రమల ఏర్పాటుకోసం భూముల గుర్తింపు త్వరగా పూర్తి చేయాలన్నారు. పరిశ్రమలు, వాణిజ్య సంస్థల్లో నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం భద్రత చర్యలు వున్నదీ లేనిదీ తనిఖీ చేయాలని ఆదేశించారు. భద్రత ప్రమాణాలు పాటించని సంస్థలకు తగిన సమయం ఇచ్చి నిర్దేశిత సమయంలోగా భద్రత చర్యలు చేపట్టేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.పరిశ్రమల శాఖ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ద్వారా పిఎంఇజిపి పథకంలో ప్రభుత్వం కేటాయించిన మేరకు యూనిట్లు ఏర్పాటు కావాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకోసం సింగిల్ డెస్క్ విధానంలో ఈ ఏడాది మే 25 నుంచి 26 జూలై వరకు 125 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 108 దరఖాస్తులకు అన్నిరకాల అనుమతులు సకాలంలో మంజూరు చేశామని జిల్లా పరిశ్రమల అధికారి పాపారావు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

వద్ద 16 దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయని, ఒక దరఖాస్తును పిసిబి తిరస్కరించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఏపిఐఐసి ఆధ్వర్యంలోని పారిశ్రామిక వాడల్లో పరిశ్రమల ఏర్పాటుకోసం అందుబాటులో వున్న భూముల పరిస్థితిని ఆ సంస్థ జోనల్ మేనేజర్ యతిరాజులు వివరించారు. సమావేశంలో ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, ఎపిఐఐసి డైరక్టర్ బంగారు నాయుడు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, గనులశాఖ డిడి, మెప్మా పీడీ సుధాకర్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, ఇపిడిసిఎల్ డిఇ ధర్మరాజు, ఎంవిఐ దుర్గాప్రసాద్, ఉద్యానశాఖ డిడి జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి విదేశీ విద్యా దీవెన నగదు జమ

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం వలన నిరుపేదలైన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గురువారం సిఎం క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి జగనన్న విదేశీ విద్యాకానుక పథకం కింద విదేశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు బటన్ నొక్కి నిధులు జమ చేశారు. ఈ కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం కాగా జిల్లా నుండి కలెక్టర్ నాగలక్ష్మి , డిసిఎంఎస్ చైర్మన్ డాక్టర్ అవనాపు భావన, డిప్యూటి మేయర్లు, శ్రావణి, లయ యాదవ్, డిబిసిడబ్ల్యూ యశోధన రావు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ ఈ పథకం కింద 8 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలు అర్హులని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ లకు 1.25 కోట్ల వరకు , ఇతరులకు కోటి రూపాయల వరకు ప్రభుత్వం విదేశీ విద్యకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ అత్యున్నత యూనివర్సిటీలలో ఉత్తమ రాంక్ సాధించిన ఆరుగురికి రూ.70,52,477 మొత్తాన్ని వారి ఖాతాలలో జమ చేసారని తెలిపారు. అనంతరం మెగా చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు

పంచాయతీ కార్మికులపై దాడికి నిరసనగా

సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకోలు

ప్రజాశక్తి - గజపతినగరం, శృంగవరపుకోట

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సుమారు నెల రోజులుగా ఆందోళన చేస్తున్న రామభద్రపురం పంచాయతీ కార్మికులపై ఆ పంచాయతీపెద్దలు, సిబ్బంది దాడి చేయడాన్ని నిరసిస్తూ జిల్లాలో పలుచోట్ల సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు నిరసన తెలిపారు. గజపతినగరం, విజయనగరం, రాజాం, ఎస్.కోటలో ఆందోళనలు చేపట్టారు. గజపతినగరం నాలుగు రోడ్లజంక్షన్‌లో జరిగిన రాస్తారోకోలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడారు. రామభద్రపురం పంచాయతీ కార్మికులు నేటికీ 26 రోజులుగా జీవో 57 ప్రకారం రూ.10వేలు జీతం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నారన్నారు. బుధవారం పంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకుల్ని చర్చలకు పిలిపించి వారిపైన దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆ పంచాయతీలో రూ.65 లక్షల వరకు ఆదాయం వస్తుందని, అయినా అక్కడ పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు రూ.5,700 నుంచి రూ. 8 వేలు మాత్రమే జీతం ఇస్తున్నారని అన్నారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని సమ్మె చేస్తున్నా సర్పంచ్, ఎంపిడిఒ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, డిపిఒ కలుగజేసుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని లేనియెడల జిల్లా వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జి.కృష్ణ, కె.కృష్ణ, లక్ష్మణ, భాస్కరరావు, జె రాము తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పారిశుధ్య కార్మికులపై దాడి చేయించిన వారిపై



గజపతినగరంలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు



శృంగవరపుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దేవి కూడలి వరకూ గ్రామపంచాయతీ అండ్ ఎంప్లాయిస్ వర్కర్స్, గ్రీన్‌అంబాసిడర్లు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిల రమణ మాట్లాడుతూ. సమ్మె చేస్తున్న వారిని చర్చలు పేరిటపిలిచి దాడి చేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ఒకే రకమైన పనిచేస్తున్న కార్మికులకు జీతాల్లో వ్యత్యాసాలు ఎందుకని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించకుండా దళితులైన పారిశుధ్య కార్మికులు పైన దాడి చేయించారని వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెలికాని ముత్యాలు, గిరిజన సంఘం నాయకులు జనతా గౌరీష్, పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

విజయనగరంలో.. పంచాయతీ కార్మికులు శాంతియుతంగా చేస్తున్న సమ్మె సమస్యను అధికారులు జోక్యం చేసుకొని తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్ మోహన్ రావు డిమాండ్ చేశారు. స్థానిక సర్పంచ్ సమ్మెలో ఉన్న కార్మికులపై దుర్భాషలాడుతూ దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి నిరసనగా విటి అగ్రహారం జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రామారావు ,రమణ ,వంశీ, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కచోటే ఓటు ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గంట్యాడ

ఎవరికైనా ఒక్కచోటే ఓటు ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రెండు చోట్ల ఓటు ఉన్నట్లయితే, ఒకదాన్ని తొలగించాలని స్పష్టం చేశారు. గంట్యాడ మండలంలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను కలెక్టర్ గురువారం పరిశీలించారు. కరకవలస, రామవరం, పెనసాం, చినమానాపురం, కొర్లాం, వసంత, కొండతామరాపల్లి, బుడతనాపల్లి, తామరాపల్లి తదితర గ్రామాల్లో చేపట్టిన సవరణ ప్రక్రియను పరిశీలించారు. తొలగింపులు, చేర్పులపై ఆరా తీశారు. ఓటు తొలగిస్తూ బిఎల్‌ఒలు ఇచ్చిన నోటీసులను, చేర్పులకు అందిన దరఖాస్తులను, యాప్‌లో వివరాల నమోదును పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తప్పనిసరిగా ప్రతీ ఇంటికీ వెళ్లి ఖచ్చితమైన ఓటర్ల వివరాలను సేకరించాలని ఆదేశించారు. జెండర్ రేషియో, ఇపి రేషియోను పరిశీలించాలని బిఎల్‌ఓలకు సూచించారు. జాబితాలో ఇంటి నంబరు, చిరునామా నమోదు చేయాలన్నారు. డూప్లికేట్ ఓట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఒక్కచోటే ఓటు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ఓటు తొలగించేముందు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలని, ఇచ్చిన నోటీసులను, వచ్చిన దరఖాస్తులను భద్రపరచాలని సూచించారు. ముఖ్యంగా మహిళా ఓటర్ల జాబితాపై దృష్టి పెట్టి, వివాహం అయి వెళ్లిపోయినవారి వివరాలను పరిశీలించాలన్నారు. చనిపోయిన వారి పేర్లను, వారి బంధువులకు నోటీసు ఇచ్చి తొలగించాలని చెప్పారు. జనాభాలో ఓటర్ల శాతం, జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఓటర్ల సంఖ్య తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఓటు తొలగించడానికి కారణాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తాహశీల్దార్ రాఘవ, డిప్యూటీ తాహశీల్దార్ స్వర్ణకుమార్, గజపతినగరం ఎలక్షన్ డిటి సతీష్, ఇతర సిబ్బంది, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూలులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

ఓపెన్ స్కూలులో పది, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ లింగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఆగస్టు 31వరకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం దగ్గరలోగల ఓపెన్ స్కూల్ సెంటరుకు వెళ్లి ఒరిజినల్ సర్టిఫికేట్ లు సమర్పించి తరువాత ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని తెలిపారు. పదోతరగతిలో ప్రవేశానికి విద్యార్థులకు 31-08-2023 నాటికి 14 ఏళ్లు వయస్సు కలిగి ఉండాలని, పదవతరగతి అడ్మిషన్లకు రికార్డ్‌షీటు లేదా టిసితో పాటు అభ్యర్థి ఆధార్‌కార్డు, తండ్రి/తల్లిఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలు పొందుపరచాలని తెలిపారు. ఎటువంటి విద్యార్హత లేకున్నా జనన ధ్రువీకరణపత్రంతో పాటు స్వీయ ధ్రువీకరణతో నేరుగా పదోతరగతిలో అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. ఇంటర్‌లో ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణత సాధించాలని, టెన్త్ పాస్ సర్టిఫికేట్ తో పాటు అభ్యర్థి ఆధార్‌కార్డు, తండ్రి/తల్లి ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ ఉండాలని తెలిపారు.

నేడు మంత్రి బొత్స రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ 28న జిల్లాకు వస్తున్నారు. ఆరోజు ఉదయం 7 గంటలకు నగరానికి చేరుకుంటారు. ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలో ఆర్థిక కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2గంటలకు శ్రీకాకుళం బయలుదేరి వెళ్లనున్నారు. 29న ఉదయం 10.30 గంటలకు పార్వతీపురం చేరుకొని జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు మెరకముడిదాం మండలం గొల్లవలసలో గ్రామ సచివాలయం భవనాలను ప్రారంభిస్తారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమల రక్షణ..కార్మికుల ఉపాధికై

1న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గరివిడి

జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు, కార్మికుల ఉపాధి రక్షణ కోసం వచ్చేనెల 1న ఉదయం 10గంటలకు విజయనగరం రెవెన్యూ హోంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గౌరినాయుడు తెలిపారు. ఈమేరకు గురువారం రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సుకు ప్రధాన వక్తగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు హాజరవుతారని తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా ఆంధ్రప్రదేశ్ లోనే ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమ లకు విద్యుత్ ఛార్జీలు ఎక్కువని, ప్రభుత్వం ఇటీవల విద్యుత్ ఛార్జీలు పెంచడంతో పరిశ్రమల యజమానులంతా విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే పరిశ్రమ లను నడపలేమని ప్రకటించాయని తెలిపారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా జిల్లాలో ఇప్పటికి కే నాలుగు పరిశ్రమ లు మూతపడ్డాయని, కొన్ని పరిశ్రమలు 50శాతం లే ఆఫ్‌గా, మరికొన్ని పరిశ్రమలు తమ ఉత్పత్తిని తగ్గించడం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పరిశ్రమలను నడపలేమని యజమానులు ప్రకటించారని, ఇదేజరిగితే జిల్లా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. ఫెర్రో ఎల్లాయీస్ సమస్యను పరిష్కారం చేసి ఉపాధి ని కాపాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే ఈ సదస్సుకు కార్మికులంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విశ్వనాథరాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, గ్రోత్ సెంటర్ అధ్యక్షులు ఎస్.గోపాలం కోరారు. రాష్ట్ర సదస్సు గోడపత్రికలను ఎం.బూర్జవలసలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడంతో ప్రజలతో పాటు ఫెర్రో పరిశ్రమలపై తీవ్ర భారాలు పడుతున్నాయన్నారు. విద్యుత్ చార్జీలు పెంపుతో ఫెర్రో పరిశ్రమలు మూసివేస్తామని యాజమాన్యాలు ప్రకటించాయని చెప్పారు.

6 నుంచే నైపుణ్యతతో కూడిన విద్య

కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ విద్యా విధానం ద్వారా ఆరో తరగతి నుంచే విద్యార్థులకు నైపుణ్యతతో కూడిన విద్యను అందిస్తామని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి అన్నారు. మాతృభాషలోనే ఐదో తరగతి వరకు తప్పనిసరిగా విద్యాబోధన జరిగేలా జాతీయ విద్యావిధానంలో మార్పులు చేశారని తెలిపారు. ఎన్‌ఇపి అమలుచేసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలో సిబిఎస్‌ఇ విద్యావిధానం అమలు చేస్తున్న పాఠశాలల ప్రిన్సిపాల్‌లతో కలసి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోరుకొండ సైనిక స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి మాట్లాడుతూ అధ్యాపకులు, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు మెరుగుపరచడం అత్యంత కీలకమైన అంశమని చెప్పారు. ఈ దిశగా దృష్టి సారించాలన్నారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలను దృష్టిలో వుంచుకొని కాకుండా ఆయా అంశాలపై పరిజ్ఞానం పెంపొందిం చా లన్నారు. ఈ సందర్భంగా బాలవాటిక-3 తరగతి గదిని, విద్యార్థులు రూపొందించిన వివిధ బోధన పరికరాల ప్రదర్శనను, బాలవాటిక-3 తరగతిని కోరుకొండ సైనిక స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్ఎన్ శాస్త్రి ప్రారంభించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్‌లు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పోర్టు సిటీ స్కూల్



బోధనాపరికరాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న సైనికస్కూలు ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శాస్త్రి

ప్రిన్సిపాల్ డాక్టర్ రోజానాఖాన్, వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.లక్ష్మణమూర్తి, జిల్లా యువజన అధికారి వెంకట్ ఉజ్వల్, డిఐపిఆర్‌ఒ డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో సంగీత ప్రదర్శనలో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థినులకు కోరుకొండ సైనికస్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ శాస్త్రి చేతుల మీదుగా ట్రోఫీ బహూకరించారు.

వేతన సవరణకై విద్యుత్తు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి

విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని, ఒప్పంద కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు జెఎసి ఆధ్వర్యాన గురువారం విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్తు ఉద్యోగుల జెఎసి చైర్మన్ డి.రాజేంద్ర ప్రసాద్, కన్వీనర్ బి.రోజకుమార్, డిస్కం ఉపాధ్యక్షులు పి.త్రినాథ్‌రావు, ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ నాయకులు, బిసి అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. సంస్థలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య కాలంలో నియమితు లైన ఉద్యోగులకు జిపిఎఫ్ సహా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని. విధి నిర్వహ ణలో ప్రమాదానికి గురై మృతి చెందిన ఎనర్జీ అసిస్టెంట్ల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగావకాశాలు కల్పించాలని, 2022 జనవరి డిఎ బకాయిలతో పాటు పెండింగ్ బకాయిలను విడు దల చేయాలని, ఏకసభ్య కమిషన్ పిఆర్‌సి నివేదికను పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, పాల్గొన్నారు.



విజయనగరం : విద్యుత్తు భవన్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జెఎసి కన్వీనర్ బి.సాయికృష్ణ, ఇఇ పూడి హరి డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బొబ్బిలిలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఎండింగ్ డిఎ విడుదల చేయాలని, పిఆర్‌సి అమలు చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్స్ పై ఆధారపడి వారికి అన్ లిమిటెడ్‌గా వైద్య సౌకర్యం కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి పని భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో డిఇలు భానునాయుడు, శ్రీనివాస్, జెఎసి నాయకులు లక్ష్మణ, శంకరరావు, దేవుడు, జయరాజు, సాంబశివరావు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాత ఇ-చలానాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలో వాహనాలపై గల పెండింగు ఈ-చలానాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాథ్ తెలిపారు. వివిధ కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీల్లో వాహనాలపైగల పెండింగు ఈ-చలానాలను పరిశీలించారు. వాహనదారులు ఈ-చలానాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టడంతో 163మంది వాహనదారులు తమ వాహనాలపై పెండింగులోగల పాత ఈ-చలానాలను చెల్లించారన్నారు. వాహనదారుడు వేరే వ్యక్తి నుండి వాహనాన్ని కొనుగోలు చేసే సమయంలో, గతంలో ఆ వాహనంపై పెండింగులో ఉన్న ఈ-చలానాలు గురించి తనకు తెలియనట్లుగా చెప్పడంతో ఆ వాహనాన్ని సీజ్ చేసామన్నారు. వాహనదారులు ఎవరైనా పాత వాహనాలను కొనుగోలు చేసే సమయంలో రికార్డులను పరిశీలించుకోవడంతో పాటు, ఆ వాహనంపై పెండింగులో ఉన్న ఈ-చలానాలు గురించి తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐలు లోవరాజు, రాజు, త్రినాధరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎస్‌ఇ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజారోగ్య సాంకేతిక శాఖ పర్యవేక్షక ఇంజనీర్ పి.గణపతి రావు గురువారం పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంజనీరింగ్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. వివిధ అభివృద్ధి పనుల టెండర్లు త్వరితగతిన పిలిచి పనులు పూర్తి చేయాలన్నారు. ఎంఇ కె.శ్రీనివాసరావు , మున్సిపల్ ఇంజనీర్ కె. దక్షిణా మూర్తి, డిఇ ఎస్.అప్పారావు, సహాయక ఇంజనీర్లు, పాల్గొన్నారు.

అన్ని విధాలా నగరం అభివృద్ధి


డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 38వ డివిజన్ ఉడా కాలనీ, బొబ్బాదిపేట ప్రాంతంలో 36.60 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. రహదారులు, కాలువలు, కల్వర్టు, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జ్ డాక్టర్ వైఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం విశ్వసనీయతను కోల్పోయిందని అన్నారు. కార్యక్రమం లో మేయర్ విజయలక్ష్మి, దాసరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గాజులరేగలో గడపగడపకూ...

49వ డివిజన్ గాజులరేగలోని కొండపల్లి వారి తోట నుండి జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ప్రజాస్పందన అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. స్థానికంగా నెలకొన్న విద్యుత్ స్తంభాల విషయమై తక్షణమే స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అక్కడున్న అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పట్ల ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సహాయకమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్లు



ప్రభుత్వ పథకాల గురించి ఆరా తీస్తున్న కోలగట్ల

నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సేవలు

ప్రజావసరాలను గుర్తించి వారి ముంగిటకే ప్రభుత్వ సేవలను అందిండమే జగనన్న సురక్ష ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం పలు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. లంచగొండితనం లేకుండా పూర్తి పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. మేయర్ విజయలక్ష్మి . కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ నగరంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ధ్రువపత్రాలు అందించే విధానం ముగిసిందన్నారు. ఇప్పటివరకు 58 వేల మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందించామన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

వంగర: మండలంలోని మద్దువలస గురుకులంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని దళిత సంఘాల జిల్లా జెఎసి నాయకులు మజ్జి గణపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అస్వస్థత గురైన రాజాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న విద్యార్థినిల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినిలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో ఎస్సి, ఎస్టి, బిసిలకు చెందిన పేద విద్యార్థులు ఎక్కువమంది చదువుకుంటున్నారని వారందరికి మెరుగైన సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత గురుకుల యాజమాన్యం, ప్రభుత్వానిదేనని అన్నారు. గురుకులంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు, వంగర, రాజాంకు చెందిన దళిత సంఘాల జెఎసి నాయకులు పాల్గొన్నారు.

కాలువ గండిని పరిశీలించిన ఆర్‌డిఒ

బొబ్బిలిరూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు అలజంగి వద్ద తోటపల్లి ప్రధాన కుడి కాలువకు పడిన గండిని ఆర్‌డిఒ శేష శైలజ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గండిని పూడ్చే పనులు త్వరితగతిన పూర్తి చెయ్యాలని నీటి పారుదల అధికారులను ఆమె ఆదేశించారు. ఆమెతో పాటు నీటి పారుదల శాఖ డిఇ కుమార్ విజలేఖ ఉన్నారు.

బేబినాయన సందర్శన

అలజంగి గ్రామ సమీపంలో తోటపల్లి కుడి ప్రధాన కాలువకు గండిపడిన విషయాన్ని తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువకు గండి పడటం వల్ల నీరంతా పొలాల్లోకి ప్రవేశించి సుమారు 50 ఎకరాల్లో పంట ముంపునకు గురై రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు.

వార్డు వాలంటీర్ పోస్టుకు ఇంటర్వ్యూ

నెల్లిమర్ల: నగర పంచాయతీలో వార్డు వాలంటీర్ పోస్టులకు గురువారం కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 8వ వార్డు సచివాలయం పరిధిలో పది వార్డు వాలంటీర్ ఖాళీ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. 23 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వాటిలో 21 దరఖాస్తులు అర్హత కలిగినవిగా గుర్తించి ఇంటర్వ్యూ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ టికెవి విశ్వేశ్వర రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

బొబ్బిలి: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని దావాలవీధి, కోరాడవీధి, పాత బొబ్బిలి రోడ్డులో పారిశుధ్య పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రతిరోజు రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు నీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాత తాగాలని, రోడ్డు పక్కన ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

విద్యార్థులకు మాత్రలు పంపిణీ

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లును పంపిణీ చేశారు. పాఠశాలలో హెచ్‌బి స్థాయి తక్కువగా ఉన్న విద్యార్థులకు ఈ మాత్రలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివి రాజు పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ రక్త పరీక్షలు చేశారు. హెచ్‌బి స్థాయిలను బట్టి విద్యార్థులను కేటగిరీలుగా విభజించి పింక్, నీలిరంగు ప్యాకెట్లు, అందజేశామన్నారు. విద్యార్థులు అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా పోషక పదార్థాలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న నాడే చదువుపై శ్రద్ధ కలుగుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త స్వప్న కుమారి, ఆశ కార్యకర్తలు శాంతి, వసంత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం

భోగాపురం: మండలంలోని గాబువానిపేట గ్రామంలో నల్ల రమణ తాపీ పని చేస్తూ పరంజ మీద నుండి పడిపోవడంతో వెన్నుపూసకి దెబ్బ తగిలి మంచానికి పరిమితమయ్యాడు. స్పందించిన భోగాపురం జనసేన పార్టీ మండల అధ్యక్షులు వందనాల రమణ సుమారు 5 వేలు రూపాయలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో గాబువాని పేట జనసేన నాయకులు ఇప్పిలి శ్రీను, రమేష్, పైడిరాజు, నక్క రమణ, శివ, నర్సింగ్ పాల్గొన్నారు.

టమోటా పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే

శృంగవరపుకోట: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు సబ్సిడీపై కిలో టమోట రూ.50కే అందించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. అనంతరం రైతు బజార్లో కూరగాయలు స్టాల్స్ నిర్వహిస్తున్న వారితో ఎమ్మెల్యే మాట్లాడారు. తొలి రోజు సుమారు 1000 మంది వినియోగదారులకు కిలో 50 రూపాయలు చొప్పున టమాట అందించామని రైతు బజార్ ఎస్టేట్ అధికారి సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, జగదీష్ ఎలమంచిలి అప్పారావు, గనివాడ శ్రీను, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు నవజాత శిశువుకు అమృతం

విజయనగరం టౌన్: తల్లిపాలే నవజాత శిశువుకు అమృత తుల్యమని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత పేర్కొన్నారు. పట్టణంలోని లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లి బిడ్డల ఆరోగ్యం పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ తల్లీబిడ్డల సంరక్షణ కు, ఆసుపత్రిలో ప్రసవం, పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ పాలిచ్చే తల్లులకు ఆరోగ్య సలహాలు అందించారు. కొత్తగా జన్మించిన వారికి మల్టీ విటమిన్లు, విటమిన్ డి3 చుక్కలు బేబీకేర్ కిట్లు, ప్రశవానంతరం వాడవలసిన పోషకాహార మందులను ఉచితంగా పంపిణీ చేశారు. రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు వి.వి.రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గ్రంధి కృష్ణ, టి.మూర్తి, కె.మధు పాల్గొన్నారు.

జిల్లా మలేరియా అధికారి పిహెచ్‌సి తనిఖీ

గజపతినగరం: జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) మణి గురువారం మరుపల్లి పిహెచ్‌సిని తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ, చికెన్ గునియా గురించి లేబరేటరీ పరీక్షల గురించి ఆరా తీశారు. ఎం.గుమ్మడం గ్రామంలో దోమల నివారణకు గాను పరిసరాల పారిశుధ్యం, స్ప్రేయింగ్ చేయమని అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు అసిస్టెంట్ మలేరియా అధికారి డి.వి రమణ, సబ్ యూనిట్ ఆఫీసర్ గోవిందరాజులు, పిహెచ్‌సి వైద్యాధికారులు ఎం.సాయి కృష్ణారెడ్డి, సుష్మ, సిహెచ్‌ఒ అప్పల నరసమ్మ, ఎంపిహెచ్ఈఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంగాంలో సంచరిస్తున్న గజరాజులు

వంగర: ఇటీవల వంగర మండలంలోకి ప్రవేశించిన గజరాజుల గుంపు మండలంలోని సంగాం, మగ్గూరు సమీపంలో గురువారం సంచరిస్తున్నాయి. గజరాజుల గుంపు ప్రవేశించి వారం రోజులు అవుతున్నప్పటికీ నేటికీ కూడా ఇక్కడ నుంచి వెళ్లటం లేదు. చెరకు, మొక్కజొన్న, వరి నారు మడులను గజరాజులు ధ్వంసం చేస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గజరాజులు రోడ్లపైకి వస్తుండడంతో ప్రయాణికులు, ప్రజలు భయాందోళనకు గురై ఇబ్బందులు పడుతున్నారు.

గిరి శిఖర గ్రామంలో వైద్య శిబిరం

శృంగవరపుకోట: ఎస్‌కోట పంచాయతీ పరిధిలో గల గిరి శిఖర గ్రామమైన గురిలోవలో కొట్టం పిహెచ్‌సి హెచ్‌వి వి. వరలక్ష్మి, ఎంఎల్ హెచ్ పి సుశీల, హెల్త్ అసిస్టెంట్ టి శంకర్రావు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వర్షాకాలం కావడంతో కొండ ప్రాంతంలో నివసించే వారు వర్షంలో తడవటం, కలుషిత నీరు తాగడం వల్ల అంటు రోగాలు, విశ్వ జ్వరాలు వ్యాపించే అవకాశం ఉన్నందున ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామన్నారు. అప్పుడే పుట్టిన వారి నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విధిగా టీకాలు వేయించాలని, గర్భిణులకు ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అన్ని సౌకర్యాలతో చేస్తున్నారని వర్షాకాలం సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని శుభ్రత పాటించాలని కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు.

పాఠశాల సందర్శన

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట పాఠశాలను గురువారం ప్రత్యేక ఉపాధ్యాయురాలు ఉదయలక్ష్మి, ఐఇఆర్‌పి రమణరాజులు సందర్శించారు. ప్రశస్థ యాప్ రిజస్ట్రేషన్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సులువైన పద్ధతిలో ఎలా బోధించాలో ఉపాధ్యాయులకు వివరించారు. పాఠశాలలో కొత్తగా నమోదైన వికలాంగుల పిల్లల జాబితాను గుర్తించారు. అనంతరం భోగాపురం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఎం. రమణమూర్తి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- వంగర

జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఈ మేరకు మండలంలోని తలగాం కొప్పరవలస గ్రామాలలో గురువారం జరిగిన సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒక చిన్న ధ్రువీకరణ పత్రం కావాలన్నా కాళ్లు అరిగేలా తిరిగి ప్రజలు ఎంతో ఇబ్బంది పడే వారిని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు, ఎంపిడిఒ వావిలిపల్లి శ్రీనివాసరావు, సంకిలి రాధ సురేష్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్‌పిటిసి గార తవుడు అన్నారు. కెంగువలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ కొండల సూరప్పడు, వైసిపి యువ నాయకులు లెంక గణేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు అందిస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం



వంగర : లబ్దిదారునికి ధ్రువ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు

480 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ప్రభుత్వ సేవా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గుడివాడ రామకృష్ణ, సీనియర్ నాయకులు లెంక శ్రీనివాసరావు, ఎంపిటిసి కొండల సునీత తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం చక్కటి వేదిక అని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అన్నారు. మండలంలోని రఘుమండి గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99శాతం మంది ప్రజలకు చేరువయ్యాయన్నారు. సింగవరం సచివాలయ కార్యదర్శి వసుందరాదేవి పనితీరు బాగోలేదని గ్రామస్తులు ఎంపిపికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపిటిసి విజనగిరి అచ్చంనాయుడు, సర్పంచులు గూడేల విష్ణు, పిట్ట పద్మావతి, కలిశెట్టి రామకృష్ణ ఉప సర్పంచ్ భావన, గురునాథరావు, నాయకులు పిట్ట అప్పారావు సంచాన కృష్ణమూర్తి, లంక అప్పలనాయుడు, బమ్మడి వెంకటరమణ, బమ్మిడి అప్పల నాయుడు, భావన శ్రీనివాసరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ ధ్రువపత్రాలను విజయవంతంగా అందిస్తున్నామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ కోట- 2, 4 గ్రామ సచివాలయల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుపేదల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, మోపాడ గౌరీశ్వరి, పడాల ధర్మారావు, లక్ష్మి, మాజీ సర్పంచ్ కె.వెంకటరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విలేకరిని బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలిరూరల్ : జగనన్న ఇళ్ల అక్రమాలపై వార్త రాసిన ప్రజాశక్తి విలేకరి రాయగడ జగదీష్‌ను బెదిరించిన వైసిపి నేత యడ్ల అప్పారావుపై చర్యలు తీసుకోవా లని తహశీల్దార్ డోల రాజేశ్వరరావుకు బొబ్బిలి విలేకరులు గురువారం ఫిర్యాదు చేశారు. ఎం.బూర్జవలస పంచాయతీలో జగనన్న ఇళ్ల పట్టాలు మంజూరులో అక్రమాలపై ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఇళ్ల పట్టాలు అక్రమాలపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేయడంతో జీర్ణించుకోలేని వైసిపి నాయకులు అక్రమాలను బయటపెట్టిన విలేకరిని బెదిరిస్తున్నారు. విలేకరిని బెదిరించిన వైసిపి నేత యడ్ల అప్పారావుపై చర్యలు తీసుకుని, జగనన్న ఇళ్ల పట్టాలు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ రాజేశ్వరరావును విలేకరులు జగదీష్, రఘు, రఫీ, జగన్, రాజేష్, శంకరరావు, కోరారు.

సిపిఎం, సిపిఐ ఖండన

అక్రమాల పై వార్తలు రాసిన ప్రజాశక్తి విలేకరిని బెదిరించి, దూర్భాషలాడిన వైసిపి నాయకుడు యడ్ల అప్పారావుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిపిఐ నాయకులు పి. శంకర్రావు, కోట అప్పన్నలు డిమాండ్ చేశారు. ఇలా బెదిరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సైకిల్ యాత్రను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిల్లాలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికై జరుగుతున్న సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం హర్ష కోరారు. గురువారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో జూలై 31 నుండి ఆగస్టు 9 వరకూ నిర్వహించే ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ విద్యారంగం మొత్తం కుదేలైపోయిందన్నారు. విద్య వ్యాపారంగా మారి డబ్బున్నోడికే చదువు అందేలా విద్యా వ్యవస్థ మారిందని అన్నారు. విద్యారంగం బలోపేతంకై జూలై 31 నుండి ఆగస్టు 9 వరకూ కొత్తవలస నుండి విజయనగరం వరకూ 400 కిలోమీటర్లు సైకిల్ యాత్ర సాగుతుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు, మెస్ చార్జీలు విడుదల, పర్మినెంట్ వర్కర్లను, వార్డెన్లను నియమించాలని డిమాండ్లతో సైకిల్ యాత్ర జిల్లా వ్యాపితంగా జరుగుతుందన్నారు. దీన్ని విద్యార్థులు, మేధావులు, సానుభూతిపరులు సహకరించి, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు రవి, మండల కార్యదర్శి రమేష్, మండల నాయకులు రిషి, నాయుడు, రాము, చిన్న పాల్గొన్నారు.

భూముల గోల్‌మాల్‌కు కుట్ర

ప్రజాశక్తి- బొబ్బిలి

బోగస్ కంపెనీలతో ఎపిఐఐసి భూములను గోల్‌మాల్ చేసేందుకు రాష్ట్ర ఐటి శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్ కుట్ర చేస్తున్నారని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి ఆరోపించారు. జనసేన కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి గ్రోత్ సెంటర్లో శ్రీసత్య బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో 36 ఎకరాల భూమి కేటాయించేందుకు కోడిగుడ్డు మంత్రి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రూ.5లక్షలు కూడా టర్నోవర్ లేని కంపెనీలకు 36 ఎకరాల భూమిను ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఎపిఐఐసి భూములను కాజేసేందుకు రెండు రోజుల క్రితం గ్రోత్ సెంటర్‌కు గుడివాడ అమర్నాథ్ వచ్చారన్నారు. గ్రోత్ సెంటర్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సిన మంత్రి బోగస్ కంపెనీలకు ఎలా భూమి కేటాయిస్తారని ప్రశ్నించారు. గ్రోత్ సెంటర్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆయనతో జనసేన నాయకులు ఎస్. గంగాధర్, కిరణ్, పి.రాజా, సిహెచ్ సతీష్, హరిచరణ్, శివ, పాల్గొన్నారు.

చోడి సాగుపై రైతుకు శిక్షణ

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని కొనిశ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చోడి పంట సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎటిటి సెంటర్ శాస్త్రవేత్తలు తేజేశ్వర్ రావు, స్వాతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. సుగర్ వ్యాధి నివారణలో భాగంగా రాగి పంట ప్రాముఖ్యత పెరిగిందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ డిమాండ్ బట్టి రాగి పంట సాగు చేయడం ద్వారా రైతులు అధిక నికరాదాయం సాధించవచ్చు అని అన్నారు. ప్రస్తుతం రాగి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ. 3846 పలుకుతుందని చెప్పారు. రైతుకు ప్రోత్సాహకం గా ప్రభుత్వం రాగి విత్తనాలను 50 శాతం రాయితీ పై అందిస్తుందన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కె.మహారాజన్ మాట్లాడుతూ వరి పంటలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, కాటుక తెగులు యాజమాన్య పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యసాయధికారి ధనలక్ష్మి, సిబ్బంది గోవిందమ్మ, రైతులు పాల్గొన్నారు.

బాడంగి : మండలంలోని రేజేరు గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ రైతులకు వరి నారు యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. నారు కొనలు తుంచి నాటడం వాళ్ళ కాండం తొలుచు పురుగుని మొదటి దశలో సమర్థవంతంగా నివారించో కోవచ్చన్నారు. నారు కట్టల్ని సూడోమోనాస్ ద్రావణంలో శుద్ధి చేపించి వరి నాట్లు వేసుకోవాలని సూచించారు.

శృంగవరపుకోట: సీజన్‌కి ముందు పొలంబడి రైతులను ఎంపిక చేసుకుని వారందరితో ఒక సమావేశం నిర్వహించి వారిలో 30 మంది రైతుల వివరాలను బేస్ లెస్ సర్వే ద్వారా సేకరిస్తున్నామని ఎఒ కె. రవీంద్ర తెలిపారు. గురువారం మండలంలోని సంత గౌరమ్మపేట గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు అనుసరిస్తున్న పద్ధతులను వారితో చర్చించి మార్పు చేయవలసిన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రవి, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

28,29 తేదీల్లో జట్లు ఎంపిక

విజయనగరం టౌన్: ఈనెల 30న విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 13 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఈనెల 28,29 తేదీల్లో స్థానిక రాజీవ్ క్రీడాప్రాంగణంలో జరుగుతుందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమానికి ఆధార్ కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలని అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసరావు, అధ్యక్షుడు డి. రజనీకుమార్ తెలిపారు. వివరాలకు 9849124387, 9010451117 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వైఎస్ఆర్ వాహన మిత్ర దరఖాస్తులపై వెల్ఫేర్ అసిస్టెంట్లతో గురువారం ఎంపిడిఒ పట్నాయక్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ వాహన మిత్ర కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు తెలుసుకోవాలన్నారు.



ప్రధానోపాధ్యాయున్ని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

'చదువులో రాజీ వద్దు'

మెరకముడిదాం: పిల్లలు చదువు విషయంలో రాజీ పడకూడదని బైరిపురం ఉన్నత పాఠశాల గత ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు అన్నారు. గురువారం బైరిపురంలో పాఠశాలలో ప్రస్తుత ప్రధానో పాధ్యాయులు మరడాన ఈశ్వర రావు ఆధ్వర్యంలో ఆ పాఠశాల నుంచి బదిలీ పై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత ఆచార్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. క్రమశిక్షణ, చదువు విషయంలో ఉపాధ్యాయులు తమ విధులను విస్మరిస్తే పిల్లల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు.

ఆదర్శప్రాయుడు ఆరి గంగయ్య

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆదర్శప్రాయుడు ఆరి గంగయ్య అని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. ఆరిగంగయ్య వర్ధంతి సందర్భంగా గురువారం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి సమితి ప్రెసిడెంట్‌గా, మున్సిపల్ ఛైర్మన్‌గా ఆరి గంగయ్య నిస్వార్థంతో పని చేశారన్నారు. పేదల అభివృద్ధికి పని చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఆరిగంగయ్య విగ్రహానికి తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షులు చనుమల్ల ప్రసాద్, లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాయితీగా పని చేసి అభివృద్ధి చేసిన ఘనత ఆరిగంగయ్యకు దక్కుతుందని అన్నారు.

సేవా గుణం గొప్పది

డెంకాడ: పేద ప్రజల కోసం సేవ చేయడం చాలా గొప్ప విషయమని ఆర్‌ఐఒ, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అమ్మ ఆదినారాయణ చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమ్మ సొసైటీ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం చదువుతున్న 50 విద్యార్థులకు సుమారు 25 వేల రూపాయలు విలువ చేసి యూనిఫారం గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల క్రితమే ఈ సొసైటీ ఆధ్వర్యంలో ఇదే కళాశాలలో 50 వేల రూపాయలు విలువ చేసే బట్టలు, కూరగాయలు, పప్పు దినుసులను పేదవారికి పంపిణీ చేశారన్నారు. మరలా ఇదే కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరికీ ఉచితంగా యూనిఫారం పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ సొసైటీ ఫౌండర్ ఝాన్సీ, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - రామభద్రపురం

గిరిజన గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పల నాయుడు అన్నారు. గురువారం మండలంలోని రావివలస సచివాలయ పరిధిలో గల చందా పురం, చదరాడవలస, గుమ్మిడి వలస, కొండగుడ్డివలస, పంతిమామిడి వలస, ఆర్.చింతల వలస గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో స్థానిక నాయకుతో కలిసి ప్రతీ గడపకు వెళ్లి నాలుగేళ్ళ పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పి కొండ సరస్వతి, వైస్ ఎంపిపి బెల్లాన ప్రసాద్, సర్పంచ్ కుమారి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, ఎంపిడిఒ రమామణి, మండల జేసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం, పిఎసిఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కొత్త పేటలో పలు అభివృద్ధి నిర్మాణ



నెల్లిమర్ల: బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

పనులను ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు ప్రారంభించారు. గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్లు, ఇంటింటికి తాగు నీరు అందించడానికి జల జీవన్ మిషన్ పనులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చేతుల మీదుగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ అట్టాడ శ్రీను, ఎంపిటిసి శాంతి కుమారి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

భార్యా పిల్లలను చూసేందుకు వెళ్తూ ఒక వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన బొబ్బిలిలో గురువారం చోటుచేసుకుంది. గజపతినగరం మండలం ఎం.గుమడాం గ్రామానికి చెందిన పత్తిగుల్ల సురేష్ (32) రోడ్డు దాటుతుండగా బోలెరో వాహనం ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. బొబ్బిలి మున్సిపాలిటీలోని అప్పయ్యపేటలో ఉన్న భార్య అరుణ, పిల్లలను చూసేందుకు ఎం.గుమడాం గ్రామం నుంచి వచ్చి బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో ఉన్న హోటల్లో టిఫిన్ చేశాడు. అనంతరం అక్కడి నుంచి రోడ్డు దాటుతుండగా పార్వతీపురం నుంచి విజయనగరం వైపు పశువులతో వెళ్తున్న బోలెరో వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కుటుంబాన్ని పోషించేందుకు సురేష్ చెన్నై వెళ్లి కుటుంబ సభ్యులను చూసేందుకు సొంత గ్రామానికి వచ్చారు. అక్కడి నుంచి భార్య పిల్లలు చూసేందుకు వస్తూ బోలారో వ్యాన్ ఢీకొని దుర్మరణం చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. సురేష్ మరణంతో అప్పయ్యపేట, ఎం.గుమడాంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పశువులు అక్రమ రవాణే ప్రమాదానికి కారణం

సురేష్‌ను ఢీకొన్న వ్యాన్‌లో పశువులను అక్రమంగా తరలిస్తున్నారు. వ్యాన్‌లో సుమారు 20 పశువులు వరకు ఉన్నాయి. పశువులు అక్రమ రవాణా బయట పడుతుందని కారణంతో బోలేరో వాహనాన్ని మితిమీరిన వేగంతో వెళ్లడంతో ప్రమాదం జరిగినట్లు సంఘటనా స్థలం వద్ద ఉన్న వారు చెపుతున్నారు. పశువులు అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జ్యూట్ కార్మిక నాయకుడు మృతి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మొయిద గ్రామానికి చెందిన రిటైర్డ్ జ్యూట్ కార్మిక నాయకుడు శీర వెంకట్రావు (63) ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం పూణేలో మృతి చెందారు. ఈయన నెల్లిమర్ల జ్యూట్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తూ శ్రామిక సంఘానికి ప్రాతినిధ్యం వహించారు. కార్మికులకు ఆరోగ్య పరమైన సేవలు అందించి కార్మిక వర్గానికి అండగా నిలిచారు. రిటైర్డ్ అయినంత వరకూ ఆయన శ్రామిక సంఘం కార్యదర్శిగా పనిచేశారు. వెంకట్రావుకి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురేష్‌బాబు, జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, ఏఐటియుసి నాయకులు మొయిద పాపారావు సంతాపం తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెద్ద తాడివాడ ఎంపిటిసి-2 పొంతపల్లి జగన్నాథం తండ్రి పొంతపల్లి ఆదినారాయణ (63) పాము కాటుకు గురువారం మృతి చెందారు. ఆదినారాయణ తన ఇంటి ముందు ఉన్న పైపులపై కూర్చున్నాడు. కాలుపై రక్తం వచ్చి నొప్పి రావడంతో కాలు వైపు చూసి కొనేసరికి పాము కరిచి వెళ్ళిపోతున్నట్లు గమనించాడు. వెంటనే సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని జక్కువ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 180 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఆంధ్ర ఎఎస్ఐ బివి రమణ తెలిపారు. చల్లపేట నుంచి ద్విచక్ర వాహనం పై మద్యం సీసాలు తీసుకొని వెళుతుండగా ఇద్దనవలస జంక్షన్ వద్ద గురువారం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిని గజపతినగరం కోర్టులో హాజుపరచగా సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు చెప్పారు.

సంతకం ఫోర్జరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని మార్లాపల్లి పంచాయతీ సర్పంచ్ గోగాడ సత్యం తన సంతకాన్ని ఫోర్జరీ చేశారంటూ స్థానిక పోలీస్ స్టేషన్ లో గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కుచ్చు సురేష్‌కు అవసరమైన పంచాయితీ తరపున ఇవ్వవలసిన ధ్రువీకరణ పత్రంపై తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై పంచాయితీ కార్యదర్శి ఎంజె చంద్రకళను ప్రశ్నించగా రబ్బర్ స్టాంప్ మాత్రమే వేశానని బదులిచ్చారు. తనకొచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్లు స్థానిక ఎస్ఐ ఎం ముకుందరావు తెలిపారు.